నుండి వివిధదేశములలో నున్నట్లు తెలియుచున్నవి. తోలుబొమ్మలాటలందు విసువుదలను మాన్పుటకై మధ్యమధ్య హాస్యపాత్రలఁ బ్రవేశపెట్టుదురు. తెలుఁగు కథలలో నివి బంగారక్క, జుట్టుపోలిగాడు మొదలైన పేర్లతో నున్నవి. వీరి హాస్య మసభ్యముగా మాత్ర ముండును. తెలుఁగున రామాయణకథ నాడునపుడు వీరు రంగనాథరామాయణ పాఠమును వాడుదురు. ఈ తోలుబొమ్మల ననుసరించియే ఛాయానాటక ప్రదర్శనములు (shadow play) చేయఁబడినవి.

మూకాభినయము

బొమ్మలాట లందలి వివిధపాత్రలను దామే యారోపించుకొని జనులు కథల నభినయింపఁదొడఁగిరి. వీరి వెనుక హంగుదార్లు పాటలు పాడుటయు, వాచికము చెప్పుటయు, వాద్యసంగీతముల చేయుటయు జరుగుచుండెను. ఇందు బొమ్మలకు బదులుగా వానిస్థానమున మనుష్యులే యాడఁజొచ్చిరి. ఇంతే భేదము. ఇదే మూకాభినయము. దీనినే (Mimic show or phanto mime) అని పాశ్చాత్యులు వాడిరి. దీనిలో ననేక భంగిమములొప్పి యభినయమునకు భావవ్యక్తీకరణము జరుగుచున్నది కదా. మన మాతృభాష రాని పరదేశీయులతో సంపర్కము గల్గి, వారికి మన భావములను దెలుపవలసివచ్చినపుడు మన మూకాభినయ మెక్కువ ప్రయోజనకారి గాదా. ఈ మూకచేష్టలుకొన్ని సాంకేతికములై నియమబద్ధములై యభినయదర్పణాది శాస్త్రగ్రంథములందుఁ గూర్పఁబడినవి. ఇందు హస్తముద్రలు మొదలైన సాంకేతికములతో భావప్రకటనము చేయఁబడినది. ఈ దశలో నృత్తనృత్యనాట్యవిశేషములు జోడింపఁబడి క్రమముగా భరతనాట్యశాస్త్రమర్యాదలు పాటింపఁబడినవి. ఇట్టి మూకాభినయ విశేషమే మలయాళమువారి 'కథకళి' యను ప్రదర్శనములు. అభినయభారము వహించు నటునకు వాచికశ్రమముగూడ గూర్చుట దుర్భరమై యేకాగ్రబుద్ధిని జూపఁజాలఁడను భీతిచే నీస్థితిలోనే నిలిపివేసిరి కేరళులు. కాని యాంధ్రులాభార విశేషమునుగూడ సహించి, సంగీతవిద్యతో దానిని మెరుగుపెట్టి నాట్యకళను పరిపూర్ణము గావించిరి. ఇది కూచిపూడి భాగవతుల ప్రదర్శనములలో విశదమైనది. పాశ్చాత్యదేశములలో పూర్వకాలమున నీ



మూకాభినయము బహుదూరమునకు గోచరించుటకై ప్రవేశపెట్టఁబడినదఁట. వారి విశాల నాట్యశాలలో ప్రస్తుత కాలమందలి 'లౌడు స్పీకర్లు లేనందున, లక్షలాది జనులకు వినఁబడనందున నీ మూకాభినయ మాదరింపబడినదఁట. ఇది Silent Cinema ల వలె నుండెడి దన్నమాట. కాని యట్టి వానియందు సామాజికులకు సంతృప్తి తక్కువ. టాకీలు వచ్చిన తర్వాత నాలోపము దీరినది కదా. కాన మూకాభినయ మెప్పుడు నసంపూర్ణమైన నాట్యకళయే. మఱియొకవైపున వీరగాథల పాటగాండ్రు కథలోని పాత్రలను దామే యారోపించుకొని, యుద్రేకముతో నాపాటల నభినయము చేయుచు పాడి, యా పాత్రలు కళ్లకుఁ గట్టినట్లుగా నటించుచు, మధ్య సంధివాచకములను మాత్రము సామాన్యముగా నుచ్చరించెదరు. ఉదా. బొబ్బిలి పాటగాండ్రు, పల్నాటి వీరగాథ పాటగాండ్రు. కాని వీనిలో ఆహార్యము లేదు.

పగటి భాగవతులు

ఈ లోపమును దీసివేయునది పగటి భాగవతములు. దీనియందు వాచికాంగికాభినయములు సిద్ధించుచు భావ రూపరేఖలు ప్రదర్శింపఁబడుచున్నవి. ఆహార్యముగూడ వలయునంత యుండును. ఇందలి సంభాషణలు చమత్కారముతో భాసిల్లుచు, వాచికాంగికాభినయములు సామరస్యమును జూపును. కాని యివి హాస్యరసమును ప్రతిపాదించుటకై కొందఱి వ్యక్తులను, కొన్ని వృత్తులవారిని, జాతులవారి ననుకరించుటకు మాత్రమే యుపయోగించు ప్రహసనములు. ఉదా: కూచిపూడివారి పగటిభాగవతములు, సున్నం వీరయ్య పగటి వేషములు నిట్టివి. కాని వివిధ సన్నివేశములతోఁగూడి, పరిణామావస్థలతో నొప్పిన యొక కథాసంవిధానముగల మహాగాథా విషయమును ప్రదర్శింపఁజాలినది కాదిది. పగటి భాగవతములందు కేవలము వినోదము మాత్రమే సిద్ధించును గాని, మహానందముగూర్చు సంపూర్ణ శిల్పముగల నాటకళ వీనియందు లేదు. మఱియు ప్రేక్షకులకు నటులందు నాటకపాత్రల భావ స్వరూపము లారోపించుటకు రాత్రి దీపములయెదుట ననుకూలించునట్లుగ పగలు వీలుపడదు. ఆహార్యమందలి కృత్రిమరూపము రాత్రి కప్పిపుచ్చునుగాని, బగలు వికారముగ, పచ్చిగ గోచరించును. కాన పగటి భాగవతములు సంపూర్ణ సంతృప్తికరములు గావయ్యెను.

## నాటకరచనారంభదశ - నాటకరీతులు

కాన రాత్రివేళల భాగవత మేళములు ప్రదర్శనముల నిచ్చుచుండిరి. వీనియందు భగవంతుని లీలలు, దేవాలయములం దుత్సవసమయములలో

**దేవతామాహాత్మ్య ప్రదర్శనములు**

మండపములందుననో, లేక గోపురములందు వేయఁబడిన యొక పందిరిలోనో యాడఁబడుచుండెను. భగవంతుని సంబంధమైన కథల నాటకములుగ నాడెడివారగుటచేతనే వీరికి భాగవతులనియు, వీరి నాటకములకు భాగవతములనియు పేరు వచ్చెనని భావింపఁదగును. ఉత్తర హిందూస్థానమున వీనిని 'యాత్ర' లను పేరితో వ్యవహరింతురు. భారతదేశమున శివలీలలో, కృష్ణలీలలో లేక భగవద్భక్తి ప్రేరకములగు ప్రహ్లాదాది భగవంతుని యవతార కథలనో యాడెడివారు. ఇట్లే పాశ్చాత్యదేశమున క్రైస్తవ మత విషయికమైన నాటకములు మతప్రచారముకొరకై ప్రదర్శింపఁబడెడివి. ఇవి మిస్టరీలు, మిరకిల్ ఆటలు, మొరాలటీలను పేరితో నొప్పినవి. వీనిని క్రమముగా మహిమారూపకములు, అర్భకరూపకములు, నీతి రూపకములని పిలువవచ్చును. వీనియందలి ప్రధానకథలు క్రైస్తవ మతగ్రంథమగు బైబులు నందలివి. ప్రపంచసృష్టి మొదలు క్రీస్తు మరణమువరకు జరిగిన చరిత్రము, తగిన వేషములతో మొదట క్రైస్తవాలయములందును, తరువాత గ్రామములందు నాడఁబడుచుండెడివి. ఈ నాటకములందు మొదట మతాచార్యులే యభినయించుచుండిరి. పిమ్మట జనసామాన్యము వీరి ననుసరించి యాడుచు మధ్య నసభ్యశృంగార హాస్య సన్నివేశములఁ గూర్చుచుండుటచే మతాచార్యు లిందు పాల్గొనరాదని వీనిని నిషేధించిరి. వీనితర్వాత వచ్చిన 'ఇంటర్లూడను' నాటకములలో వ్యక్తిశీల మెక్కువగా ప్రదర్శింపఁబడెను. సంస్కృతమున ప్రబోధ చంద్రోదయమును, తెలుఁగున వీరశైవుల యక్షగానములు నిట్టివి.

మతప్రచారక నాటకములలో మధ్యమధ్య ప్రాకృతపాత్ర సంభాషణలతోఁ గూడిన హాస్యరససన్నివేశములనుబోలిన ప్రదర్శనములు ప్రహస

**ప్రహసనాలు కామెడీలు రోమాన్సులు**

నములను పేరితో వర్ధిల్లెను. ఇందు వ్యక్తుల లోపము లతిశయోక్తులుగ చిత్రింపఁబడి, పరిహసింపఁదగిన యువస్థలను కల్పించుచు తదనుకూలమగు భాషను, సంభాషణములు నుపయోగింపఁబడినవి. వీనిని పాశ్చాత్యులు ఫార్సులని వ్యవహరించిరి. ఇవి చాల చిన్నవి. భారతీయ ప్రహసనము లేకాంకికములు మాత్రమే.



ఈ ఫార్సులనుండియే పాశ్చాత్యదేశమున 'కామిడీలను' మోదాంత నాటకము లుద్భవిల్లినట్లు గనఁబడుచున్నది. 'కామిక్' అనగా హాస్యము. కాన హాస్యముగొల్పు నాటకము కామిడీ యైనది. ఇది ఫార్సుకంటె పెద్దది. గ్రీసులో పెరిక్లీసుకాలమున విరోధినాయకులను పరిహసించుటకై కామెడీలు వ్రాయఁబడినవి. అరిస్టాఫీసు వ్యక్తులను వెక్కిరించుట మాని సంఘమందలి దురాచారములను పరిహసించుచు రూపకములను వ్రాసెను. ఈ రీతిగ మానవ మనస్తత్త్వమందు దేశకాలమతాభిమానములచేఁ గల్గిన లోపములను సంస్కరించుటకై కామెడీల రచన ప్రారంభమయ్యెను. ఇది క్రమముగ శృంగారరస ప్రధానమై, హాస్యసంగీత సంయుతమైన కళ్యాణాంత నాటకముగ పరిణమించెను. పిమ్మట యిది 'రొమాన్స' అను రూపకముగఁ గూడ పరిణతి నొందినది. ఇట్టి నాటకములందు మానవ జీవితమందలి లలితవిలాస భాగము కథా వస్తువుగా గ్రహింపఁబడుచు వచ్చినది.

భగవన్మాహాత్మ్య ప్రతిపాదక నాటకములలో లీలావిలాసమయమగు భాగము శృంగారరసప్రధాన నాటకములకును, కామిడీలకును తగిన

**ఉదాత్త నాటకములు-ట్రాజెడీలు**

వస్తువుకాఁగ, గంభీరోదాత్త భాగములు ట్రాజిడీలకు, వీరరసప్రధానమైన రూపకములకు నితివృత్త మొసఁగినది. రాజు, లేదా నాయకుఁడు భగవదంశ సంభూతుఁడనియు, వానియందు భగవంతునియందువలె నుదాత్తగుణము లుండుననియు విశ్వసింపఁబడుచుండెడిది. కాని రాజు విష్ణ్వంశసంభూతుఁడే కాని, విష్ణువు గాక, కేవల మానవుఁడగుటచే మానవునియందుండు కామక్రోధాది యరిషడ్వర్గము రాజునం దుదాత్తగుణములతోఁ బాటుగ నుండును. ప్రతి మానవునియందు వివేక, విజ్ఞాన, భూతదయాది దివ్యగుణములును, కామక్రోధాది పాశవప్రవృత్తులును మిశ్రరూపము దాల్చియుండి, యీ ద్వంద్వమున కెల్లప్పుడును సంఘర్షణము దన మనస్సునందుఁ గలుగుచునే యుండును. మహానాయకునియం దెన్ని యుదాత్తగుణము లున్నను,

నరిషడ్వర్గములో నే యొక దుర్గుణమో ప్రకోపింప, తన పరిస్థితులందు దానికి వశ్యుఁడై, యంతర్గుణ సంఘర్షణమున తన పాశవప్రవృత్తిచే విజితుఁడై తన పతనమును దానే తెచ్చికొని కరుణభయములను గొల్పును. ఇట్టి నాయకుని చరిత్రము వస్తువుగాఁగొని రచింపఁబడిన నాటకములు 'ట్రాజిడీ' లని ప్రసిద్ధి వహించెను. ఈ రీతి నాటకరచనలో సిద్ధహస్తుఁడైన యాంగ్లకవియే షేక్స్పియరు. ఈతని మహానాటకములగు 'హామలెట్, ఒథెల్లో, మాక్బెత్తు, లియర్', లు ప్రపంచవిఖ్యాతి నొందినవి. ఈ నాటకమందలి రచనయు కూర్పు నెక్కువ బిగువు గల్గి మొదటినుండి చివరవరకు కార్య కారణసంబంధముతో, మానవ మానసిక వ్యాపారక్రమానుగుణముగా నుండునేకాని, యెక్కడను వినోదమునకు తావిడక, నటులను సామాజికులను గూడ జాగ్రదావస్థయం దుంచును.

ఆపెరా

నాటకము నిర్భరభావపరంపరతోఁ గూడుకొనుటయే కాక నుల్లాసము, నానందమును గూర్చు లలితకళావిశేషమని యెంచి, యిందు సంగీతమును, నృత్యమును గూడ జోడించిన నెక్కువ యానందావహముగ నుండునని భావించి, నాటకారంభదశలలో గుర్తించిన నాట్యసంగీతముల కెక్కువ యవకాశమిచ్చిరి కొందఱు కవులు. ఈ నూతన నాటకములలో సంభాషణములు పద్యములలోనే నెరపఁబడి, జంత్రగాత్రములతో భావగీతములు పాడఁబడి, నృత్యము చేయఁబడుచుండెను. ఇట్టి నాటకములు 'అపేరా' లని పాశ్చాత్యులు వ్యవహరించిరి. ఇవి ఇగ్లండు, ఫ్రాంసు, జర్మనీ యిటలీ దేశములలో గౌరవముతో ప్రోత్సహింపఁబడినవి. కొంతకాలమున కివి యితివృత్తములలో నీతిబాహ్యతను బొందినవి. అందుచే 'గ్లూ'కను నాస్ట్రియా దేశీయుఁడు 1762 లో వీనికి సంగీతప్రాధాన్యమును, నాట్యలక్షణమును తగ్గించి, యభినయమును, భావప్రకటనము నధికముచేసి, సంగీతమును రసపుష్టి గలిగింపవలసిన పట్ల మాత్రమే యుపయోగించెను. భారతదేశమున 'ఆపెరా లకు బోలినది సంస్కృతమున జయదేవుని గీతగోవిందమని చెప్పవచ్చును మధ్యయుగమున తెలుఁగులో వ్రాయఁబడన యక్షగానము లిట్టివే.



మెలోడ్రామా

ఆపెరాలనుండి 'మెలోడ్రామా' జనించినది. పూర్తిగ గేయ సంభాషణలు గల్గి, సంగీత నాట్యములతో నొప్పిన 'ఆపెరా' లతి మధురమువలె కొంచెము విసుఁగుజనింపఁజేసినవి. అందుచే వైవిధ్యముతోఁగూడి సామాన్యనాటకమందలి వాచకములతో పాటక్కడక్కడ కొన్ని పాటలు, మట్లు, జంత్ర సంగీతమును జేర్పబడి, నాటకమునకును 'ఆపెరా'కును మధ్యమార్గమున 'మెలోడ్రామా' నడచినది. ఇందుచే నాటకప్రదర్శనము జనసామాన్యమున కెక్కువ వినోద సంతోషములఁ గూర్చి, రసపోషణమును భావప్రేరణమును గల్గించినది. తెలుఁగులో ధర్మవరం కృష్ణమాచార్యులగారి గద్యపద్య గీతాత్మకములైన నాటకములీ జాతికిఁ జెందుచున్నవి. కాని మన నాటకములందు జంత్రోపకరణములు నటుల గాత్రలోపమును గప్పిపుచ్చుచు నసమర్థులగు వారిచే వాయింపఁబడును. పాశ్చాత్యుల 'ఆపెరా, మెలోడ్రామా' లలో జంత్రోపకరణములు లలితప్రచారముతో ప్రశాంతావస్థలందును, నవరసంబుల ప్రతిపాదించుచు నాట్యమాడు నపుడును భావసంకీర్ణ రమణీయ సందర్భములందును, మానవగాత్రముల కందని సుకుమార మృదుమధుర వైఖరుల ప్రకటించుటకు, ప్రత్యేక భావసౌకుమార్యప్రభావముల ద్యోతకము చేయుటకు నుపయోగింపఁబడును. మన నాటకములలో హార్మోనియము, తపలా మ్రోఁతలు నటుల గాత్రమును మరుఁగుపఱచి, వారి వాచకార్థముల కడ్డు తగిలి, శ్రవణకఠోరముగ, గడబిడ, గందరగోళమును బుట్టించును. ఆపెరాకు కొంతవాచకము చేర్పఁబడినందున, కేవలము రాగతాళపూరితమగు గేయరూపకములందుకంటెను మెలోడ్రామాయందు రసవంతములైన కథాసన్నివేశములను వివరించుట కవకాశము లేర్పడి, రసోద్దీపనము, భావావిష్టము విశేషమై, సంగీతనాట్యములు కొంచెము తగ్గి, మహానాటకములందలి గంభీరభావ సంఘర్షణములును, సంసారిక మర్యాదలును నేత పాకమునఁబడి, సాంఘికప్రహసనమందలి హాస్యరసస్ఫురణతో చక్కని,

చిక్కని పాకమున రసభరితములై యొప్పినవి. ఇట్టి రచనచేయుటకు మహా సమర్థులగు కవులు, నిరుపమాన కవితాశక్తితోపాటు మానవస్వభావమును, విచిత్రమగు రసవజ్జీవితావస్థలను గుర్తెరింగినవారై, గాన పద్ధతులను, రంగవివరములను తెలిసిన నిపుణులైన వాగ్గేయకారకులై యుండవలయునుగాని సామాన్యులకు సాధ్యముగాని పని.

వచన నాటకాలు

పై నాటకములలో గాన నాట్యకవిత్వము లధికమై యభినయమును మఱుగుపఱచినవని భావించి, వానిని త్యజించి కథకు ప్రాధాన్యమొసఁగ రచింపఁబడినవి వచన నాటకములు. మఱియుఁ గొందఱి దృష్టిలో గాన నాట్య కవిత్వాలను సమకూర్చు మహాకార్యమును నిర్వహింపలేని సామాన్యులు కేవలము వచన నాటకములను వ్రాయ మొదలుపెట్టిరి. ఇందు పాత్రపోషణము చక్కఁగ నిర్వహింపఁబడినది. కొన్ని రకముల వ్యక్తు లిందు పాత్రలుగాఁ బ్రవేశపెట్టఁబడి సంఘమందలి కొన్ని లోపములను ప్రతిపాదించుట కివి బాగుగ నుపయోగించును. 18 వ శతాబ్దములో నాంగ్లమున గోల్డుస్మిత్తు ( Goldsmith ) రచించిన 'Good Natured man; She stoops to Conquer'ను, Sheriden వ్రాసిన 'Rivels; School for scandal' మొదలగు నాటకము లిట్టివి. మనలో కం. వీరేశలింగంగారు వ్రాసిన గద్యనాటకములుగూడ నిట్టివే యనవచ్చును. పైన వివరించిన నాటకములన్నియు పాశ్చాత్య దేశములలో వికసించినవి. ఈ విధముగ పండుగలందును, పితృదేవతోత్సవములందును, ప్రతిదేశములో నృత్యగీతాభినయములతో ప్రారంభించి, మానస్వభావానుకరణమున నభివృద్ధిపొంది, కళావైగుణ్యమున పరిణతిచెంది, రూపక స్వరూపమును దాల్చెను. నాటకకళ ప్రారంభమున దేవతారాధనమున మొలకెత్తిన రూపకబీజములతో, దేవతాగణముల లీలావ్యాపారములను ప్రతిపాదించుటతో వికాసమొంది, వీరపురుషుల మహోదార చరిత్రములను నిరూపించునదై, తర్వాత కాలక్రమమున ప్రజాధర్మములను ప్రత్యేకవ్యక్తుల మహిమోన్నతులను గౌరవించు రీతులను



గూడ దాటి, సామాన్య సాంసారిక సన్నివేశములను, సాంఘిక సమస్యలను కథాంశములుగ గ్రహించుచున్నది. నాటకచరిత్ర యిట్టి పరిణామము గలది.

ఆంధ్రదేశము – నాటకావతరణము

'నాటకాంతం సాహిత్య'మ్మను నార్యోక్తి ననుసరించి పురాణకావ్యముల తర్వాతనైన నాంధ్రమున నాటకరచన ప్రారంభింపఁబడవలె. కాని క్రీ.శ. 19 వ శతాబ్దాంత్య పాదమునఁగాని యథార్థమున కాంధ్రమున నాటకములు ప్రారంభము గాలేదు. మఱియు పై 'నాటకాంతం సాహిత్య'మ్మను మాట తెలుఁగునకు పట్టదు. ఏల యనఁగా నా సంప్రదాయము స్వతంత్ర సారస్వతములకుఁగాని, యనుకరణములతోడను, భాషాంతరీకరణములతోడ నారంభించిన వాఙ్మయములకుఁ గాదు. ఆంధ్రవాఙ్మయము సర్వవిధ రచనములందు - పురాణ, కావ్య, శాస్త్రాలంకారాదు - లన్నింటియందు సంస్కృతవాఙ్మయమునే యనుసరించి, యందలి గ్రంథములనే యాంధ్రీకరించుటతో ప్రారంభించినది. ఆంధ్ర సారస్వతావతరణ మగునప్పటికే సంస్కృతవాఙ్మయ శాఖలన్నియు పూర్తియై, యా భాషయందలి గ్రంథరచనముగూడ చాలవఱకు సమాప్తమునకు వచ్చినది. సంస్కృతమున నాటకరచన క్రీస్తుశక ప్రారంభముననే మొదలిడి 7, 8, శతాబ్దుల నాఁటికే ప్రఖ్యాత నాటకములన్నియు వ్రాయఁబడినవి. ఇట్టి పరిస్థితులలో నాటకాంధ్రీకరణముకాని, స్వతంత్రాంధ్ర నాటకరచన కాని క్రీ.శ. 1875 వఱకు ప్రారంభింపఁబడలేదను విషయమొక విచిత్రముగాఁ దోఁచుచున్నది. దీనికిఁ దగిన సమాధానములుకూడ దొరుకుటలేదు. ఆంధ్రులకు నాటకాభిరుచి లేదా? నాటక రంగశాలలు లేవా? వారు నాగరికులు, రసజ్ఞులు గారా? అని యనేక సందేహములు గలుగుచున్నవి. మిగిలిన వివిధ వాఙ్మయ శాఖలలో నిరుపమానమైన ప్రజ్ఞను ప్రదర్శించిన యాంధ్రు లిందుల కసమర్థు లనుటకు వీలులేదు. అగుచో నాటకాభావమునకు కారణమేమని ప్రశ్న. దీనికిఁ దోడు లక్షణ గ్రంథముల నాంధ్రీకరించినవారు

గూడ నాయా మూలగ్రంథములలోఁగల నాటకలక్షణ భాగములను వదలివేసిరి. ఉదా: విద్యానాథుని ప్రతాపరుద్రీయమున కాంధ్రీకరణముల నఁదగు విన్నకోట పెద్దనకృత కావ్యాలంకారచూడామణి, భట్టుమూర్తి కృత కావ్యాలంకారసంగ్రహములలో నాటక ప్రకరణమే లేదు. క్రీ.శ. 1550 ప్రాంతమున చిత్రకవి పెద్దనమాత్రము తన 'లక్షణసార సంగ్రహమున' క్లుప్తముగ నాటకలక్షణమును దెలిపినాఁడు. ఒక్క తెలుఁగుననే కాక, యితర దక్షిణ దేశభాషలగు తమిళ, మలయాళ, కన్నడములందు గూఁడ నాటకములు, స్వతంత్రములుకాని, భాషాంతరీకరణములుగాని, 1875 వఱకు రచింపఁబడలేదనియు, నాటక ప్రదర్శనములుగూడ లేవనియు నాయా భాషలందలిపండితులందఱు నేకగ్రీవముగ చెప్పుచున్నారు. కాన వీనికంతయు నేదో కారణ మొకటే యుండునని భావింపనగును. మఱియు సంస్కృత నాటకములు నాటకరూపమునఁగాక, శ్రవ్యకావ్యములుగా నాంధ్రీకరింపఁ బడుటలో నీ సందేహము దృఢపఱచుచున్నది. సంస్కృతమునందలి కృష్ణ మిశ్రకృత ప్రబోధచంద్రోదయనాటకమును నంది మల్లయ్య, ఘంట సింగనలును, కాళిదాసకృత శాకుంతలనాటకమును పిల్లలమఱ్ఱి పినవీరన శృంగారశాకుంతల మను పేరను శ్రవ్యకావ్యములుగ నాంధ్రీకరించిరి. ఆంధ్రమున నాటకాభావమువలె, కేవల వచనకావ్యములుగూడ తంజాపు రాంధ్ర రాజ్యకాలమువఱకుఁగూడ లేకుండుట మఱియొక వింత. సంస్కృతమున దండికృత దశకుమారచరిత్రమను వచనకావ్యమును మూలఘటిక కేతనయు, బాణుని కాదంబరిని భాస్కరుని కేతనయు చంపూకావ్యములుగ నాంధ్రీకరించిరి. వీనినిబట్టి యాంధ్రమున చంపూమయ శ్రవ్య కావ్య రూపమునకుఁగల ప్రభావ మే యితరవిధ కావ్యరూపములకును ప్రాచీనకాలమున లేదని గుర్తింపనగును.

యథార్థమున కాంధ్రవాఙ్మయమున నన్నయకాలమునుండి 19 వ శతాబ్దమువఱకు నాటకమునుగూర్చిన సూచనలు, ప్రస్తావనములు మొదలైనవి లేకపోలేదు. నన్నయ భారతావతారికలో రాజనరేంద్రుఁడు చెప్పినట్లుగా నిట్లు వ్రాయఁబడినది.



చ. విమలమతిం బురాణములు వింటి ననేకము, లర్థధర్మ శా
స్త్రములు తెఱంగెఱింగితి, నుదాత్తరసాన్విత కావ్యనాటక
క్రమములు పెక్కు చూచితి."

మఱియు, తమిళ ప్రాచీనకావ్యమగు శిల్పాధికారమునఁగూడ నాటకప్రశంస యున్నదఁట. కాని యిందుఁ దెలుపఁబడిన నాటకములు సంస్కృత నాటకములై యుండనోపు. కాని పాల్కురికి సోమనాథుఁడు తన పండితారాధ్య చరిత్రమున పర్వతప్రకరణములో నిట్లు రచించినాఁడు.

"ద్వి. ప్రమథపురాతన పటుచరిత్రములఁ – గ్రమమంద బహునాటకము లాడువారు
లలితాంగ రసకళాలంకారరేఖ – లలవడ బహురూప మాడెడివారు
* * * * * * *
విధమున ప్రచ్ఛన్న వేషముల్ దాల్చి – యధికోత్సవము దుల కాదునట్లాడ
* * * * * * *
భసితంపుఁ బూఁతపైఁబరఁగు బచ్చెనలు – నసలార చిరుగజ్జియలు నందియలును,
* * * *
జనులు హర్షింప నాస్థానముల్ సొచ్చి – యనుకూల వివిధవాద్యసమ్మేళనమున
నార్భటంబిచ్చి యొయ్యన జవనికల – గర్భంబుఁ వెడలి యక్కజము వట్టిల్ల,
నాడకముందర నభినయం బొలయఁ – జూడకముందర చోద్యంబు దనర,
నిక్కుచును త్రిభంగి నిలుచుచు నట్ల – చొక్కుచు సభమాచి యొక్కింత నగుచు."

మఱియు బసవపురాణమున నిట్లు రచింపఁబడినది.

"కరమర్థి నూరూర సిరియాళచరిత – పాటలుగాఁగట్టి పాడెడివారు
ఆటగాక సాంగభూషాంగ క్రియాంగ – పటునాటకంబుల నటియించువారు."

పిమ్మట క్రీడాభిరామమున, మంచనశర్మ మాచల్దేవియను వారాంగనను గూర్చి యిట్లు పలుకును.

"లెస్సగాగ కిరాట యీ లేమచరిత, మాడుదురు నాటకంబుగ నవనిలోన
దీనిఁ జూడఁగఁబోదమా యీ నెపమున, నరసి చూతము మనకేమి యవల ననుచు."

ఈ నాటకములు మహానాటకములవంటివా? కావా, యను విషయము నవి యాడఁబడు రీతినిబట్టి నిర్ణయింపవచ్చును. క్రీడాభిరామమున శ్రీనాథుఁడు జక్కులవారి యాటపాటలనుగూర్చి యిట్లు రచించినాఁడు.

సీ. కోణాగ్ర సంఘర్ష ఘుమఘుమధ్వని తార, కంఠస్వరంబుతో గారవింప,
మనిబొట్టుబోనాన ననలు కొల్పినకన్ను, కొడుపుచేఁ దాటించు నెడపదడప,
శ్రుతికి సత్కర్షంబుఁ జూపంగవలయుచోఁ, జెవిత్రాడు బిగియించు జీవకట్టి,
గిల్కుగిల్కునఁ మ్రోయు కింకిణీగుచ్ఛంబు, తాళమానంబుతో మేళవింప,

గీ. రాగముననుండి లఘించు రాగమునకు, నురుమయూరాదద్వయంబుపై నొత్తగిల్ల,
కామవల్లీమహాలక్ష్మి కైటభారి, వలపు పాడుచువచ్చె జక్కులపురంధ్రి.

మఱియు శ్రీనాథుఁడు భీమఖండమున దాక్షారామ భీమేశ్వరమహోత్సవమున వేశ్యలు వేషముల ధరించి నాటకములాడుట నిట్లు వర్ణించినాఁడు.

సీ. విరులదండలతోడి వేణికాభారంబు, పాంకంబు పిఱుదులఁ బొలసియాడ,
మణితులాకోటి కోమలఝణత్కారంబు, రవలి మట్టెలమ్రోఁత నవఘళింపఁ,
కుచురునిండిన చిన్ని గుబ్బచన్నులమీఁద, ముత్యాల త్రిసరంబు మురువుఁజూప,
వలమానతాటంక వజ్రాంకురచ్ఛాయ, లేఁతవెన్నెలఁ బుక్కిలించి యుమియ,

గీ. సాని యీశానియై మహోత్సవమునందుఁ, గేల నవచంద్రకాంతపు గిన్నెపూని
వీథి భిక్షాటన మొనర్చువేళఁ జేయు, మరులు నృత్యంబు జగముల మరులు గొలుపు.

మఱియు నీప్రబంధములను వేదికలపై నాడుదురనికూడ శ్రీనాథుఁడే కాశీఖండమున నిట్లు దెల్పినాఁడు.

ఉ. వల్లకి చక్కి కాహళము, వంశము, ఢక్క, హుడుక్క ఝర్ఝరుల్
ఝల్లరి యాదిగాఁ గలుగు శబ్దపరంపర తాళశబ్దమై
యుల్లసిలం బ్రబంధముల నొప్పుగ నాడుదు రగ్రవేదిపైఁ
బల్లవపాణు లీశ్వరుని బంటమహీశులు పూజసేయఁగన్.

అని వ్రాయుటచే నీనాటకప్రబంధములు నాట్యవిధానమునుబట్టి యక్షగాన ప్రబంధములే కాని, రంగస్థలనాటకములు గావని నిర్ణయింప వచ్చును. వీరి తర్వాత పింగళి సూరన తన ప్రభావతీప్రద్యుమ్నమున నాటక ప్రస్తావన మిట్లు చేసినాఁడు.

సీ. సరవి చంచత్పుట చాపపుటోద్ఘట్ట, షట్పితాపుత్రిక సంజ్ఞలమర,
తెలియుచుండెడి సమవిషయ తాళప్రవృత్తులు నాల్గు ప్రస్తార కలనవలన,
గలుగు నానాతాళములు యథోక్తస్ఫూర్తి, బరఁగు నేలాది ప్రబంధచయము
కర్తృదర్శస్థాన దత్తపటాక్షర, బిరుదాదికాంగ విస్ఫురణఁ దనర,



గీ. క్షితిఁ జతుర్దశముద్రిక గీతభేద, ములు దురాసములంద్రు వర్తిలె నవియును
నిఖిలకళలును గల రౌక్మిణేయు శిక్ష, వలన దన్నాట్యకర్మ ప్రవర్తనమున.

ఉ. ఆ వనజాక్షనందనుఁడు నంతట నాంది దగం బఠించి యిం
పావహిలం బ్రరోచనయు నాముఖముం దనరార నొప్పి ప్ర
స్తావనతో ముఖాదులగు సంధులు సొంగతఁ బెంపుమీర గం
గావతరాది నాటకములాడె ననేకము లద్భుతంబుగన్.

పింగళి సూరన వర్ణించిన రెండు పద్యములలో మొదటిది యక్షగానప్రదర్శనమును, రెండవది రంగస్థల నాటకప్రదర్శనమును వివరించునదని యందలి విషయములనుబట్టి స్పష్టముగఁ దెలియుచున్నది. ఈ యక్షగానములు నాటకములనియు, ప్రబంధములనియుఁగూడ వ్యవహరింపఁబడెడి వనుటకు శ్రీనాథుని కాశీఖండమునుండి పై నుదాహరింపఁబడిన పద్యమేకాక, యనుమోద సన్యాసి రచించిన బసవకల్యాణమను యక్షగానమందలి యంత్యగద్యలో నిట్లు వ్రాయఁబడినది.

“ ………… అనుమోద సన్యాసి ప్రణీతంబైన శ్రీబసవకల్యాణ యక్షగాన ప్రబంధంబునందు సర్వంబు నేకాశ్వాసంబు సంపూర్ణము.”

మఱియు శివలెంక మల్లనార్యుఁడు రచించిన వీరభద్రవిజయమను యక్షగానంబున నంత్యగద్యలో నిట్లున్నది.

“ ……………. మల్లనారాధ్య ప్రణీతంబైన శ్రీవీరభద్రవిజయంబను శృంగార నాటక గేయప్రబంధ కథయందు ……… తృతీయాశ్వాసము.”

గోకులపాటి కూర్మనాథకవి రచించిన మృత్యుంజయవిలాసమును యక్షగానమనియు నాటకమనియుగూడఁ బేర్కొనినాఁడు.

వీనినిబట్టి యక్షగానములు ప్రబంధములనికూడ వ్యవహరింపఁబడెడివనుటయు, నందలి భాగము లంకములని కాక, యాశ్వాసములనియే వాడఁబడెడి వనుటయు స్పష్టము. ఇంతేకాక శ్రవ్యకావ్యములందువలె వీని ప్రారంభమున నిష్టదేవతాప్రార్థనము, సుకవిస్తుతి, కుకవినింద, షష్ఠ్యంతములు, నంకితము, కథాప్రారంభము, సంధివచనములు, కథాకథనము మొదలైన వుండును. మఱియు వీనిలో చంపూకావ్యములం

ముందు పద్య వచనములతోఁ బాటు, వీనికిఁ బూర్వకాలమే యుండి పాడుటకు వీలగు మాత్రాగణబద్ధములైన గేయములును, ద్విపదలు నధిక ముగనుండి ప్రాధాన్యము వహించును. ఈ గేయములు పలువిధములు గలవు. ఉదా: జంపెలు, త్రిపుటలు, అర్ధచంద్రికలు, కందార్థములు, ధవళములు, ఏలలు, మొదలైనవి. ఇందుచే, పద్యగద్య మిశ్రరచన చంపూకావ్య మనఁబడినట్లుగా, పద్యగద్యములతోఁ బాటు గేయములు గూడ విశేషముగ కలిసియున్న ప్రబంధము యక్షగానమనియు, నిందు పాటలు విశేషముగా నుండుటచే పాడుటకుఁ దగి, శ్రవ్యకావ్యమునకు, దృశ్యకావ్యమగు నాటకమునకు మధ్యస్థముగానుండి, పాడి వినిపింపఁదగిన దనియు గ్రహింపఁదగినది. అందుచేతనే క్రీ. శ. 1550 ప్రాంతమువాఁడగు చిత్రకవి పెద్దన తన లక్షణసార సంగ్రహమున మొదటిసారిగా యక్షగాన మునుగూర్చి యీ విధముగాఁ దెలిపినాఁడు.

సీ. వృషభగతి త్రిపుటరేకంఘ్రియుగమగుఁ, మఱి నేడు లఘువులు తొలఁగఁజేయ,
జంపెరేకునకు లక్షణము ద్విరదగతి, యగు కడ నొక లఘు వందుమాన,
రచ్చరేకగును దురగవల్గనముగతి, మఱి యేకతాళియా మధురగతిని,
అటతాళమున మాత్ర లంఘ్రి కిర్వదినాల్గు, నాల్గిట విరతి పద్నాలుగింట.

గీ. నిలుచు నర్ధంపు నర్ధచంద్రికలు దీన, యక్షగానాది కృతులలో నాద్యు లిడిన
రగడభేదంబు లివియౌను రమ్యచర్య, లలిత నిజదాససముదాయ యాంజనేయ.

దీని ననుకరించియే తర్వాత నప్పకవి 1650 సం॥ ప్రాంతమునఁ దన యప్ప కవీయములో నీ క్రింది సీసపద్యమున యక్షగాన లక్షణము నిట్లు రచించినాఁడు.

సీ. తుద నేడు లఘువులు తొలగించి చదివినఁ, ద్రిపుటకు వృషభగతి పదయుగము,
లలిఁ గడపల నొక్క లఘువు మానిన జంపె, మను ద్విరదగతి సమపదయుగము,
గురుతగు రచ్చెరకుఁ దురగవల్గనా, హ్వయ మేకతాళి యా మధురగతికి,
నంఘ్రి కిర్వదినాలు గటతాళమున మాత్ర, లొలి విశ్రాంతి పద్నాలుగింటఁ,

'గీ. తెలియ నర్ధంబు నర్ధచంద్రికలు వీన, యక్షగానప్రబంధమ్ము లతుకవచ్చు.'

కాని విన్నకోట పెద్దనయొక్క కావ్యాలంకారచూడామణి రచనాకాలము వరకు యక్షగానములు కేవలము పాటల స్థితిలోనే యున్నవనియు, విన్న



కోట, పెద్దన చిత్రకవి పెద్దనల మధ్యకాలమున (ననఁగా క్రీ. శ. 1350–1550 మధ్య)నవి యొకస్వరూపమును దాల్చినవని యూహింపవచ్చును. పై లక్షణ పద్యమునుబట్టి చంపూప్రబంధములకు గేయముల నతికినచో, నప్పకవి 'వీన యక్షగాన ప్రబంధంబు లతుకవచ్చు' నని చెప్పినట్లుగ, యక్షగాన ప్రబం ధము లగునని స్పష్టమగుచున్నవి. ఇంతకంటె, నాటకమునందు వీర శృంగారరస ప్రధానమైన కథ సంభాషణరూపముగమాత్రమే యుండుట, విష్కంభప్రవేశకాదులతో రంగప్రవేశయోగ్యత, మొదలగు మహానాటక లక్షణము లిందుండవు. పై లక్షణ పద్యమున చిత్రకవి చెప్పినట్లు రగడలకు, గొంత మార్పుచేసినచో 'త్రిపుట, జంపె, ఏక, అట' యను తాళముల కనుగుణముగా నేర్పడు గేయములనే పేర్కొనెనుగాని వానికిఁ గల పేర్లను దెల్పలేదు. యక్షగానములలోఁ గనఁబడు గేయములను దేశీయరచనలు 'ఏలలు, జోలలు, సువ్వాలులు, ఆరతులు, ధవళ ములు, శోభనములు, చందమామ సుద్దులు, వెన్నెల పదములు, తుమ్మెద పదములు, గొబ్బి పదములు, కోవెల పదములు, చిలుక పద ములు, అల్లోనేరేళ్లు, త్రిభంగులు, సీస-కందార్థములు, ద్విపదలు, త్రిపదలు, చౌపదలు, షట్పదులు, మంజరులు, జక్కులరేకులు, మొద లైన వనేకము దేశవ్యవహారమున నున్నట్టివే. పదములను నామాంత రముగల యీ గేయములు మల్లికార్జునపండితారాధ్యుని కాలమునకే యాంధ్ర దేశమున వ్యవహారమున నున్నవని పండితారాధ్యుఁడు వాదార్థమై వెలనాఁటిచోడుని సభకేగునపు డాయనశిష్యులు, ననుయాయులు భక్తులు గొందఱు పాడుచు వెంటవచ్చిరని పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రమున నిట్లు తెలుపఁబడినది.

"పదములు తుమ్మెదపదముల్ ప్రభాత, పదములు పర్వతపదము లానంద
పదములు శంకరపదముల్ నివాళి, పదములు వాలేశుపదములు గొబ్బి
పదములు, వెన్నెలపదములు, సంజ, వర్ణన మఱి గణవర్ణన పదము
లర్ణవఘోష ఘూర్ణిల్లుచునుండఁ, బాడుచు నాడుచుఁ బరమహర్షమున
గూడి సద్భక్తి సంకులమేగుదేర."..............

ఈ విధములైన గేయము లధికముగా చంపూకావ్యమునఁ జేర్చి యక్షగాన పబంధములను గూర్చుటచే నివి గానప్రధానములై ముఖ్యముగా పాడు

టకు వినియోగింపఁబడెడివని విశ్వసింపవచ్చును. గేయములు పాడునపుడు లయతాళానుగుణముగ గాయకుల పదములు (పాదములు) లేక, అడుగులు పడుట సహజము. పదవిన్యాసము ప్రధానముగాఁగల, లేదా, పద విన్యాసముల కవకాశమిచ్చు పాటలు, లేక గేయములు పదములని వ్యవహారసిద్ధములైనవి. పదవాఙ్మయ మనఁగా గేయవాఙ్మయ మని భావము. కాన నిట పదములనఁగా మాటలనికాని, పంక్తులనిగాని చెప్పరాదు. ఇవే ప్రాచీనకాలమున జక్కులవారిచే రసవంతముగా పాడఁబడుటచే, వారి పేరితో నవి వ్యవహరింపఁబడి జక్కులపాటలై, యా పదము సంస్కృతీకరింపఁబడి 'యక్షగానము'లనఁబడినది. యక్షగాన ప్రాతిపదికరూపము లివే యనఁదగును. శ్రవ్యకావ్యములగు పురాణాదులు చంపూరూపమునుండి పండితులచే పురాణకాలక్షేపములు చేయఁబడునట్లుగా, యక్షగానములు మధురకంఠముగల స్త్రీలచే పుణ్యదినములందు పాడఁబడెడివి. ఇట్లనియే క్రీడాభిరామమున మంచనశర్మ విశదీకరించెను కదా. మఱియు శ్రీనాథుఁడు భీమఖండమున దక్షవాటిపురమును 'కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు గాంధర్వమున యక్షగానసరణి' అని వ్రాయుటచే 'యక్షగానసరణి' గాంధర్వమున, అనఁగా గానవిద్యకు చేరినదనియే విశదమగుచున్నది. ఇది యక్షగాన ప్రారంభదశారూపము. సామాన్యముగా చిన్నగేయములు పాడఁబడఁగా, క్రమముగా కొంత కాలమునకు కథాప్రణాళికగల యక్షగానమును వేషము ధరించిన యొక స్త్రీచేఁ బాడఁబడుచు, ప్రక్కన సంధివచనములు మొదలైనవి హాంగుదారుఁడగు నొక పురుషునిచే చెప్పఁబడుచుండెడివి. ఈ విధముగా, నేఁటి కాలమున హరికథ నొక్కఁడే చెప్పునట్లుగా, పూర్వ మొక్క స్త్రీ మాత్రమే యక్షగానమునంతయు పాడెడి దన్నమాట. మఱియు నామె గేయములను తాళలయానుగుణముగ పాడునపుడు నాట్యాభినయమును గొంతచేయుట యనివార్యమగును కదా! ఇందుచే నిది దృశ్యమై, తద్రచన దృశ్యకావ్యముగా పరిణమించినది. ప్రాతిపదికలో యక్షగాన ప్రదర్శనమున గానమునకు మాత్రమే ప్రాధాన్యము గలదు. గాని, నృత్యము బహుస్వల్పమని యంగీకరింపక తప్పదు. ఈ విధముగా యక్షగాన



మార్యుల సంస్కారముతోగాని, సంస్కృత భాషాజ్ఞానముతోగాని యెంతమాత్రము సంబంధములేక, శుద్ధదేశీయ ప్రక్రియగల రచనా, విశేషముగ దేశీయపరిసరములో స్వతంత్రముగాఁ బుట్టి పెరిగినదనియే చెప్పవలయును.

యక్షగానోత్పత్తి :

ప్రస్తుతము యక్షగానము లాంధ్ర కర్ణాటక, తమిళభాషలందు వ్యాప్తిలోనున్నవి. వీనిలో నే యొక్కదానియందుననో మొట్టమొదట పుట్టియుండఁగా, తర్వాత మిగిలిన భాషలలో నది యనుకరింపఁబడి వ్యాపించియుండును. ఏ భాషలో నిది ప్రప్రథమమున పుట్టినదో విచారించి దెలిసికొనినచో నది తర్వాత నితర భాషలలో ననుకరింపఁబడినదని యెంచవచ్చును. మఱియు దాని కావేరెట్లు గలిగిన దను విషయముగూడ నొక సమస్యగా పరిణమించినది. పై భాషలన్ని దీనిని తనదిగా నెంచుట సహజమే. కాన క్రమముగ నా వాదములను విచారించి సత్యము నిర్ణయింపఁదగినది.

కర్నాట యక్షగానము.

'త్రివేణి' యను ద్విమాసాంగ్లపత్రిక, (సంపుటి 7, సంచిక 2 — Sept - Oct. 1934) లో శ్రీ వి. రాఘవన్ యక్షగానమునుగూర్చి వ్రాసిన వ్యాసములో, వివిధ భారతీయ నాటకములలో దక్షిణమున కన్నడమండలముగూర్చినది 'యక్షగాన' మనియు, కన్నడదేశమందలి దక్షిణ కన్నడమండలమునకు 'యక్షగాన' ము చెందినదని "To the vast indigenous theatre of India, the contribution of South Canara is the Yakshagana" The Yakshagana belongs to South Canara in the Kannada area, For it is the Karnataka country that has named our South Indian music & dance as "Karnatic" అని వ్రాయ సాహసించినారు. దీనికి వారుచెప్పిన కారణము దక్షిణదేశమున సంగీతమునకు నృత్యమునకు 'కర్ణాటక'మని వ్యవహరింపఁబడుటయే నఁట. కాన ముందుగా నా మతము పరిశీలింపఁబడును. దక్షిణదేశపు గాన నృత్యములు 'కర్ణాక' విశేషణముతో వ్యవహరింపఁబడినంత మాత్రమున, యక్షగానములుగూడ కర్ణాటదేశ జన్యములని యూహించుట యెట్టి హేతువాదమో తెలియరాదు.

దక్షిణ గాననృత్యములకైనను 'కర్ణాట' మనుపేరేకాలమునుండి, యెందుచేఁ గల్గినదోకూడ వివరింపఁబడలేదు. కాన నీ హేతువొక ప్రమాణముగ గ్రహింప నక్కరలేదు. ముందావిషయము నిర్హేతుకమని స్పష్టపడఁగలదు. కొందఱు కన్నడపండితులు యక్షగానోత్పత్తి కొక యూహను దెల్పుదురు. దీపావళి పండుగను కన్నడులు యక్షరాత్రి యందురఁట. ఆ రాత్రియందే కుబేరుఁడు బలినుండి తన ధనమును తిరిగి పొందెనఁట. అందుచే సంతోషముతో కుబేరానుయాయులగు యక్షులు నృత్యగానములు సేసిరఁట. ఆ విషయస్మారకముగ కన్నడ భాగవతమేళములు దీపావళినాఁడు నాటకము లాడుదురఁట. అవియే యక్షగానములనఁబడె నని కన్నడపండితులగు శ్రీ తిమ్మప్పయ్య, దన 'పార్థసభ' యను గ్రంథమున యూహించిరి. వీరి యూహ మఱియొకటి గలదు. ఇంద్రసభలో గంధర్వులు నృత్యగానములు సేయుచుండఁగా, యక్షులు వారికి భృత్యులై సేవచేసెడి వారఁట. ఒకమారు యక్షులందఱుగూడి దైత్యుల గురువగు శుక్రాచార్యుల యొద్దకేగి, యీ సంగీతనాటకమును నేర్చికొని వచ్చిరని కన్నడనుడి యఁట. కాన దీనికి యక్షగానమను పేరు వచ్చినదఁట. దీనికిఁదోడు పాశ్చాత్యులగు 'లడ్విగ్'ను, 'గెల్డినర్' అను దొరలు యక్షశబ్దమునకు 'పండుగ' అని యర్థము చెప్పిరఁట. దీనినిబట్టి యక్షగానమనఁగ 'పండుగలో పాడఁదగిన రచన' యని భావింపఁబడుచున్నది. ఈ యూహలలో మొదటి రెండును పుక్కిళి పురాణమునకుఁ జెందినవి. ఎందుకన దీపావళి నరకాసురసంహార సందర్భమున నాచరింపఁబడునది. బలికి దీనితో సంబంధము లేదు. మఱియు నీ విషయమే సంస్కృత పురాణమందును లేదు. మఱియు నీ పౌరాణిక సంప్రదాయము కన్నడులలో మాత్రమే యుండి, యితర జాతులలో నెక్కడ వినరాదేమి? కన్నడులకు యక్షులకు నేమైన ప్రత్యక్షసన్నిహిత సంబంధమున్నట్లు సాక్ష్యము గలదా? విశేషించి యక్షగానపదము సంస్కృత, కన్నడ ద్రావిడ వాఙ్మయములం దెక్కడను 17-వ శతాబ్దమునకుఁ బూర్వము విన, గన రాదని యా భాషలందలి పండితులందఱు నేకగ్రీవముగా నంగీకరించుచున్నారు. కాన నీ యూహలు రెండును దీనికి ప్రాచీనతఁగల్గిం



చుటకై యర్వాచీన కన్నడ పండితులు గొందఱు గల్పించినవే యని చెప్పక తప్పదు. ఇఁక పాశ్చాత్యుల వ్రాఁతలు, పై కథల ననుసరించిన తెలిసీ తెలియని వ్యాఖ్యానములు. క్రీ. శ. 16-17-వ శతాబ్దములందుండి దేశభాషలలో యక్షగానములు గనఁబడుచుండఁగా, 18-వ శతాబ్దములో నవి బయలుదేరినవని, ఇ. పి. రైసుదొర, తన కన్నడవాఙ్మయ చరిత్రలో నాంగ్లమున వ్రాయలేదా? ఇట్టి పుక్కిళి పురాణమే తెలుఁగున కామేశ్వరి పాటలో శివుఁ డిద్దరి యక్షులనిచ్చి కామవల్లి దేవతను పాటలతో తరతరములు గొలువవలసినదిగాఁ జెప్పిన కథగూడ. ఈ కథలన్నియు యక్షగానమునకుఁ బ్రాచీనతఁ గూర్చుటకుఁ గల్పింపఁబడినవే కాని, సత్యము లెంతమాత్రము గాఁ జాలవు.

**తమిళ యక్షగానము**

పైనఁ దెలిపిన త్రివేణివ్యాసములో శ్రీ రాఘవన్ 'తమిళ నాట్యవాఙ్మయమున ననేక విచిత్రమైన పేర్లున్నను, యక్షగాన మను పేరందు లేదనియు, చెన్నపట్నము, తంజావూరు లిఖితపుస్తక భాండాగారములలో ననేక తమిళాంధ్ర యక్షగాన గ్రంథము లున్నను, వానిలో నేదియు 18-వ శతాబ్దమునకుఁ బూర్వపుది లేదనియుఁ' దెల్పెను. ఈ వాక్యములనుబట్టి తమిళమున నీ విషయమునకై పరిశోధించి ప్రయోజనము లేదు. కాని తమిళుఁడైన యీయన తెలుఁగును గూర్చి చెప్పిన వాక్యములు సాహసములైనవనియే యనవలెను. ఏలన రుద్రకవికృత సుగ్రీవవిజయము క్రీ. శ. 1550 ప్రాంతమున నుండఁగా నతఁడిట్లనుట తెలియక పల్కిన మాటలే కదా. ఇఁక తమిళమందలి కురవంజులు మాత్రము 16-వ శతాబ్దమునుండి కలవు. ఇవియైనను తెలుఁగున యక్షగానోత్పత్తియైన రెండు శతాబ్దముల తర్వాతనుండియే బయలుదేరినవి.

ఇఁక మలయాళుల 'కథకళి' నృత్యము కేవలము మూకాభినయమగుటచే యక్షగానముతో నెక్కువ సంబంధము లేకపోయినను-నివిగూడ 17-వ శతాబ్దోత్తరభాగమునుండియే వెలసినవి కాని, తత్పూర్వ మవి మృగ్యమగుటచేఁ - దెలుఁగు యక్షగానములకు బహుకాలము తర్వాతనే యవి బయలుదేరిన వనుట నిశ్చయము.

కాన నాంధ్రమున యక్షగానముల స్థితిని విచారింతము. వెనుకఁ దెల్పిన త్రివేణిలో వ్యాసమున శ్రీ రాఘవన్, శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి గారితో సంప్రతింపఁగా, వారు 'యక్షగాన మను పేరు తెలుఁగు దేశమందలి గుంటూరు జిల్లాలో నుండు గాన నాట్యములందు నైపుణ్యముగల జక్కులను నొక కులమువారినుండి వచ్చినదనియు, నది 'జోల, యేల' మొదలగు పామరుల పాటలనుండి పరిణమించిన దనియుఁ' దెల్పిరని వ్రాసిరి. రగడ వృత్తమున కీప ద్భేదముగల యీ యేల, జోల పాటలను బోలినవి క్రీ. శ. 1210-1247 ప్రాంతమున శార్ఙ్గర దేవుఁడు రచించిన సంగీతరత్నాకర మునఁ దెలుపఁబడినవనియు, 1304 - 24 ప్రాంతమున ఉమాపతియను ప్రాకృతభాషాకవి పారిజాతాపహరణమను, యక్షగాననాటకమువంటి గేయనాటకమును రచించెననియు, కాళిదాసుని విక్రమోర్వసీయనాటక చతుర్థాంకమున ద్విపదిక మను గేయము రచింపఁబడిన దనియుఁ దెల్పి, యీ విధమగు సంస్కృత ప్రాకృతభాషాప్రభావమున దక్షిణదేశమున యక్షగానము లుద్భవించినవని చివరకు సిద్ధాంతము చేసిరి. ఏ రావ్యాన ప్రారంభముననే, నివి సంస్కృతమందలి నాట్యసంగీతశాస్త్ర పరిభాషతోఁ గూడినవని తెల్పిన సంస్కృతభాషాభిమాను లగుటచే నట్లనుట సహజమే. కాని, తర్వాత వారు యక్షగానమందలి యక్ష-గాన పదములు సంస్కృత శబ్దములే యైనను, సంస్కృత, ప్రాకృత, ద్రావిడ వాఙ్మయములందెక్కడ 18-వ శతాబ్దమునకుఁ బూర్వము యక్షగానపద ముపయోగింపఁబడ లేదని వ్రాసి చాల తికమకలు పడిరి. తర్వాత వారు కన్నడపండితులను, కన్నడ సంగీతశాస్త్రజ్ఞులను యక్షగానమునుగూర్చి సంప్రతింపఁగా నిది యొక ప్రాచీన సంగీతపద్ధతియని వారు తెల్పఁగ, వీథినాటకములం దుప యుక్తమగు 'కీర్తన' వంటి యొక పాటకే యక్షగానమను పేరు ప్రాచీన కాలమున నుండెఁగాఁబోలని మనస్సును సమాధానపఱచుకొని యూర కొనిన ట్లావ్యాసముననే వారు దెల్పిరి. ప్రారంభముననే యక్షగానము కన్నడ దేశమునఁ బుట్టినదని భావించినవారగుటచే, సమంజసమైనను కాక పోయినను, కర్ణాటపండితుల సమాధానము సంతృప్తికరముగ వారికిఁ దోఁచినది. కాని ప్రభాకరశాస్త్రిగారి వాక్యములు వారికి నచ్చలేదు. అసాధారణ భాషాపరిశోధకులై, సంస్కృతాంధ్రముల పండితులైన



ప్రభాకరశాస్త్రిగారికి విక్రమోర్వశీయనాటకాదులనుగూర్చి తెలియక పోయినదా? ప్రతి దేశీయభాషయందును జాతీయగేయ నృత్య సంగీత ములు గలవు. ఇవి భరత నాట్యశాస్త్ర సంగీతములకంటె భిన్నములైనవి. యక్షగానములందు ప్రయుక్తములగు గేయములు, నృత్యము, సంగీత మును దేశిసంప్రదాయమునకుఁ జెందినవే కాని, భరతనాట్యశాస్త్ర సంప్రదాయమునకుఁ జెందిన మార్గపద్ధతి ననుసరించిన వెంతమాత్రము కావు. యక్షగానములందలి నృత్యగానములు శుద్ధ దేశిసంప్రదాయము గలవి యనియు, భరతనాట్యము మార్గసంప్రదాయము గలదనియు, సంగీత మందుఁగూడ నిట్లే యనియు పండితులందఱు నంగీకరించిరి. వీని విభాగము లను లక్షణగ్రంథములందుగూడఁ దెలిపిరి. సంగీతదర్పణమున నిట్లున్నది.

శ్లో. మార్గ దేశివిభాగేన సంగీతం ద్వివిధం మతం,
ద్రుహిణేన యదుద్దిష్టం యదుక్తం భరతేన చ
తద్దేశి హి యయా రీత్యా యత్స్యా ల్లోకానురంజనం
దేశేదేశే తు సంగీతం తద్దేశీత్యభిధీయతే.

అనఁగా భరతమునిచే నియమింపఁబడి శిష్టమై, శాస్త్రీయమైన సంగీతము మార్గయనియు, శాస్త్రనియమములేక లోకానురంజనమునకై వివిధ దేశములందు వివిధరూపములుగా పాడఁబడునది దేశిసంగీత మనియు పేరు. ఏలలు, దరువులు, మొదలైనవి దేశిసంగీతమునకుం జెందినవి. ఇఁక నాట్యమునుగూర్చి దశరూపకమున నిట్లు దెలుపఁబడినది.

శ్లో. అన్యత్ భావాశ్రయం నృత్య, మన్యత్తాళ లయాశ్రయం,
అద్యం పదార్థాభినయో మార్గో దేశీ తథా పరం.

సంగీతనాట్యముల రెండింటియందుఁ గూడ నీ మార్గ దేశి విభాగ మున్నట్లు సంగీతరత్నాకరమందలి యీ శ్లోకములు స్పష్టపఱచుచున్నవి.

శ్లో. గీతం వాద్యం తథా నృత్తం త్రయం సంగీత ముచ్యతే,
మార్గో దేశీతి తద్వేధా తత్ర మార్గ స్స ఉచ్యతే ॥
యో మార్గితో విరించాద్యైః ప్రయుక్తో భరతాభిః,
దేవస్య పురత శ్శంభోః నిరతాభ్యుదయప్రదః ॥
దేశేదేశే జనానాం యద్రుచ్యా హృదయరంజకం,
గీతం చ వాదనం నృత్తం తద్దేశీత్యభిధీయతే.

శ్లో. యేషాం శ్రుతిస్వరగ్రామ జాత్యాది నియమో న హి
నానాదేశ గతిచ్ఛాయా, దేశరాగాస్తు తే మతాః,
కామచారప్రవర్తిత్వం దేశీరాగత్వ లక్షణం,
నియమే సతి చేత్తత్ర మార్గత్వ మనలక్షితం.

ప్రతిదేశమునందును, భాషయందును, జానపదులందు వారివారి దేశీయాభిరుచుల కనుగుణముగ నాటలు పాటలును యథోచితముగ పుట్టి పెరుగుచుండును. అట్టిదే ప్రాతిపదికయందు యక్షగానము. వీనియందలి, ఏల, జోల, మొదలైనవి దేశీయగేయగానములకు సంబంధించినవే కాని, భరతనాట్య సంగీతముల కెంతమాత్రము చెందినవి కావు. కొంతకాలమైన తర్వాత భరతనాట్యమును కూచిపూడి బ్రాహ్మణ భాగవతులు యక్షగాన ప్రదర్శనమునఁ బ్రవేశపెట్టి, నూతన సంస్కారమును దానికిఁ గలుగఁ జేసిరి. వీరికిఁ బూర్వము గొల్లలు, యానాదులు మొదలైన నికృష్ట జాతులవారు వీనిని యథోచితముగా నాడెడివారు. కాన ప్రస్తుత ప్రదర్శన విధానమునుబట్టి ప్రాతిపదికలోఁ గూడ నట్లే భరతనాట్య ముండెనని భావింపరాదు. శ్రీ రాఘవన్ అంతకు కొలఁదికాలమునకుఁ బూర్వమే చెన్నపట్నమునఁ జూచిన యొక కన్నడ యక్షగాన ప్రదర్శనమునుబట్టియే తన వ్యాసమును రచించెనని తెలుపుకొనెను. కాననే యాయన యిన్ని భ్రమప్రమాదములకు గురియయ్యెను. ఆయన కూచిపూడి భాగవతుల ప్రదర్శనమును గూర్చి వినియుండెనే కాని, చూచియుండడు.

శ్రీ వి. రాఘవన్ వాక్యములను వేదప్రమాణముగా నెంచి డా. నేలటూరు వెంకటరమణయ్యగారు యక్షగానములను గూర్చి యాంధ్రపత్రిక ఖర సంవత్సర యుగాదిసంచికలో, యక్షగానములందు ద్విపద లధికముగా నుపయోగింపఁబడుటచేతను, విక్రమోర్వశీయ చతుర్థాంకమున ద్విపదికమను మాత్రాగణగేయము వాడఁబడుటచేత, నీ ద్విపదికయే యాంధ్ర ద్విపదలకు మూలమనియును, యక్షులు దేవయోనులును, వారి రాజు కుబేరుఁడును, వారు నాట్యసంగీతములందు సుప్రసిద్ధులగుటయు, యక్షుల ప్రశంస పురాణములందే కాక, బౌద్ధగ్రంథములందుఁ గూడ నుండుటచే, వారు పుక్కిటిపురాణమునకుం జెందిన మిథ్యాప్రపం



చపు వారెంతమాత్రమునుగాక, వాస్తవవ్యక్తులనియు, యక్షగానము నందలి నృత్యగానములు భరతనాట్య సంగీతములె కాన, యక్షులకును యక్షగానములకు తప్పక సంబంధ ముండితీరవలెనని వారు వాదించుచు, సంస్కృత ప్రాకృత భాషాప్రభావ సంజనితమే యక్షగానమని వారు విశ్వసించిరి. డా. వెంకటరమణయ్యగారి దేవలోక సంబంధవాదము వెనుక ప్రస్తావించిన కన్నడ సోదరుల వాదమువంటిదే కాని వేరుకాదు. వారి వాదము నంగీకరించినను, దేవలోక యక్షులకు, భూలోక ద్రావిడ యక్షగానములకుఁ గల సంబంధ మిదమిద్ధమని స్పష్టముగ వివరించినవారు లేరు. కేవలము నామసామ్యమున బట్టతలకు మోకాలికి ముడివేయఁ జూచుట యేల ? ద్విపద యన రెండు పాదములు గలదని యర్థము కాని, ద్విపదిక గణములును ద్విపదగణములు నొకటే యని కాని, యతిసామ్యమని కాని సమర్థింప గలరా ? మఱియు యక్షగానమున దరువు, జంపె, అర్థచంద్రికలు, ఏలలు, జోలలు, మొదలైనవానికున్న ప్రాముఖ్యము ద్విపదకు లేదు. తదుపరి యక్షపదమునకు దేవయోనులని కాక, జక్కపదమునకు సంస్కృతీకరణమనియు, జక్కులు, బలిసీడులు మొదలగువారు గుంటూరు మండలములో సంగీతాది లలిత చిత్రకళానైపుణ్యము గల జాతివారనియు, వారి పాటయే యగు 'జక్కులపాట'కు సంస్కృతీకరణము యక్షగానమైనదనియు భావింపఁబడుచున్నది. పల్లెపాటలు నేఁడు జానపద గేయములని వ్యవహరింపఁబడుట లేదా ? తెలుఁగు మాటలు పేలవములనియు, సంస్కృత పదములు గంభీర గౌరవప్రదములనియు భావింపఁబడిన కాలమున పల్లెవాండ్రు అగ్నికులక్షత్రియులనియు, కంసాలులు విశ్వబ్రాహ్మణులనియు, మంగలులు నాపితులనియు, భోగమువారు కళావంతులనియు వ్యవహరింపఁబడినట్లే, జక్కులవాండ్రు యక్షులనియు, జక్కులపాట యక్షగానమనియు సంస్కృతీకరింపఁబడిన వనుట సమంజసముగనే యుండును.

ఇఁక వేటూరి ప్రభాకరశాస్త్రిగారి వాదము పరిశీలింపఁబడును.

యక్షగానము – కురవంజి

'తొలుత ద్రావిడభాషలలో వెలసిన దృశ్యరచనములు కురవంజులనియు, ఆంధ్రకర్ణాట ద్రవిడ దేశముల యరణ్యములలో నివసించు నాటవికులు కురవలు, చెంచులు ననువారి, అంజె=అడుగు, చిందు, నృత్యవిశేషమునుండి కురవంజి యను నృత్య (నాటక) నామ ముద్భవించినదనియు, కొరవంజి యనుపేరు, తొలుత వారి నృత్యము

నకు, పిదప నృత్యవిశిష్టమైన వారి చిన్నచిన్న గేయరచనలకు, నాపై కురవంజ వారికిఁగూడఁ బేరైనది' అని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు సుగ్రీవవిజయ పీఠికలో వ్రాసిరి. మఱియు నందులోనే 'ఈ కురవంజుల ననుకరించియే యక్షగానములు బయలుదేరిన' వని తెల్పిరి. కాన నీ విషయము కొంత విచారింపవలసి యున్నది. శాస్త్రిగారు 'కురవ+అంజి' యని పదవిభాగము చేసి, అంజ, అంజె, అంజి, యను రూపములను సిద్ధింపఁజేసిరి. కాని తమిళపండితులు దీనిని 'కురు+వంజి' అని పదవిభాగము చేసి, 'వంజి' యనఁగా రచన యనియు, 'కున్ఱు-కొండ' యయినదనియు, కుర=కొండకు సంబంధించినదని యర్థము చెప్పుదురు. కురవన్=అనఁగా కొండజాతి పురుషుఁడు, కురత్తి=కొండజాతి స్త్రీ యనియు వ్యవహారము. మఱియు 'వంజి' శబ్దమునకు తీగె, నర్తకుఁడనికూడ యర్థమున్నదని మద్రాసు విశ్వకళాపరిషత్తునందలి తమిళపండితులు దెలుపుచున్నారు. మఱియు 'కురవంజి' యనఁగా కొండజాతివారిని, లేదా వేటకాండ్రను గూర్చి చేసిన రచన యని యా పండితులే తెలుపుచున్నారు. ప్రభాకరశాస్త్రిగారు వ్యాఖ్యానించినట్లుగా 'కురవ+అంజి, అంజె, అంజి' యని పదవిభాగము చేయరాదనికూడ నా తమిళపండితులు తెలిపిరి. కాన 'కురవల చిందు' లేదా, నాట్యమని చెప్పుట దోషమని స్పష్టము. ఇఁక రెండవ యాక్షేపణ మేదనఁగా, తమిళభాషలో నీ కురవంజులు క్రీ. శ. 16-వ శతాబ్దమునుండి మాత్రమే కలవనియు, నంతకుఁ బూర్వమా భాషలో నవి లేవనియుఁగూడ మద్రాసు విశ్వకళాపరిషత్తునందలి తమిళ పండితులందఱు నేకగ్రీవముగా ఘంటాపదముగా తెల్పుచున్నారు. తమిళమునందే కాక, కన్నడమందుఁగూడ నంతేనఁట. ఇఁక మలయాళమునఁగల 'కథకళి' గూడ 17 వ శతాబ్దమునకుఁ బూర్వములేదని నచటి పండితులు చెప్పుచున్నారు. ఆంధ్రమున యక్షగానములు క్రీ. శ. 13, 14-వ శతాబ్దమునుండికూడఁ గలవని పైనఁజూపిన తార్కాణములనుబట్టి స్పష్టమగుచుండఁగా, ద్రావిడ భాషలందలి 'కురవంజి' యను నాట్య నాటకమునుండి తెలుఁగున యక్షగాన ప్రక్రియ పుట్టెననుట విశ్వాసార్హము గాదు. మఱియు నీ 'కురవంజి' యను పదము కురవజాతివారికిఁగూడ పేరైనదని శాస్త్రిగారు వ్రాయుట హాస్యాస్పదముగ నున్నది. ఆ జాతి



వారు కురవలని తామే మొదట వ్రాసి, మరల నిట్లు వ్రాయుటలో నర్థమేమి? 'యక్షగాన' మను సంస్కృతపదము తెలుఁగున 'జక్కులపాట' యనినట్లుగానే, తమిళమున దానిని 'ఇయక్కి-కూత్తు' అని యందురు. యక్షశబ్దమునకు తమిళ తద్భవరూపము 'ఇయక్కి' యనియు, 'కూత్తు' అనఁగా తమిళములో పాట అనియు నర్థము. ఉదా: 'తెరుకూత్తు'= వీధిపాట, కాన నా రూపము సిద్ధించినది. కనుక యక్షగాన ప్రక్రియ దక్షిణదేశమున నాంధ్రులలో స్వతంత్రముగఁ బుట్టి పెరిగినదని నిస్సంశయముగ చెప్పవలయును. శ్రీ. వి. రాఘవన్, డా. నే. వెంకటరమణయ్య గార్లు యక్షగానము సంస్కృత ప్రాకృత భాషాప్రభావమున దక్షిణదేశ భాషలలో నుద్భవించినదని వాదించుచుండఁగా, వే. ప్రభాకరశాస్త్రిగారు సుగ్రీవవిజయ పీఠికలోనే, యక్షగానము దేశీయప్రక్రియయని యంగీకరించి, యందలి 'కోణంగి', సంస్కృత నాటకములలోని విదూషకస్థానీయుఁడగుట స్పష్టముగాఁ గానవచ్చును. సంస్కృతనాటకములోని 'ధ్రువాగానమే', కురవంజులలో దరువనఁబడెను. దేశీయ రచనలలోనుండి 'సింగి, సింగడు', కోణంగి, దరువు, అనునవి క్రమముగ నటీ నటులుగను, విదూషకుఁడుగను, ధ్రువగను, సంస్కృతనాటకములఁ జేరెనేమో యనికూడ యోజింపఁదగినట్టు లున్నదని' వ్రాసిరి.

పై విచారణనుబట్టి యక్షగానము సంస్కృత ప్రాకృత భాషా వాఙ్మయములతో సంబంధింపని శుద్ధదేశిప్రక్రియకుఁ జెంది, మొట్టమొదట నాంధ్రములోఁ బుట్టి, తర్వాత తమిళ కన్నడభాషలలో ననుకరింపఁబడినదనుట స్పష్టము. దీనిని మొట్టమొదట నాంధ్రులలో జక్కులవాండ్రు పాటగా పాడెడువారనియు, నందుచేతనే జక్కులపాటని పేరువచ్చి, దాని సంస్కృతీకరణముగ యక్షగానమని వ్యవహరింపఁబడుచుండెను. ప్రారంభమున దీనియందు పాట యధికముగను నాట్యము స్వల్పముగా నుండెడిది. తర్వాత 15-వ శతాబ్దమునుండి కూచిపూడి భాగవతులు వివిధపాత్రలను ప్రవేశపెట్టి భరతనాట్యమును నందుఁ జొప్పించిరి. అందుచే

రెండుమూఁడుగంటలలో నాడఁగల రచన రాత్రి 10 గంటలనుండి తెల్లవారుఝామున వఱకు నాటకము సాగుచుండును. ఇందు స్త్రీ పాత్రలను పురుషులే ధరించెడివారు.

విజయనగరసామ్రాజ్యమున శ్రీ కృష్ణదేవరాయల కాలమునఁ గూచిపూడి భాగవతు లక్కడకుపోయి యా రాజుచే సత్కరింపఁబడినట్లు 'తాయికొండ' నాటకప్రదర్శనమునకై చేయఁబడిన దానశాసనము కూడ దెలుపుచున్నది. అంతకుపూర్వము వీరనరసింహరాయల సమక్షమున కూచిపూడి భాగవతులు, సిద్ధవటమందలి బేతంకొండ కధికారియైన సంబెట గురవరాజుయొక్క దారుణచర్యలను నాటకరూపమున ప్రదర్శించినట్లు గల స్థానిక కవెలలను డా. నే. వెంకటరమణయ్యగా రుదాహరించిరి. విజయనగరరాజ్య వ్యాప్తికాలమగు శ్రీకృష్ణదేవరాయని పరిపాలనమున 16-వ శతాబ్దమునుండి తంజావూరు, మధుర, పుదుకోట మొదలగు దక్షిణదేశమున నాంధ్రుల వలసరాజ్యములగు నాయకప్రభుత్వముల నేర్పరిచినపు డాంధ్రదేశమునుండి కవులు, పండితులు, నటులు, గాయకులు మొదలగు వారుగూడ నా దేశమునకుఁబోయి యక్షగాన ప్రక్రియగల రచనలను, ప్రదర్శనముల నభివృద్ధిచేసిరి. విజయనగర రాజ్యకాలమున నాంధ్ర, తమిళ, కన్నడులకుఁ గూడలిగ నేర్పడి పరస్పర సన్నిహితముగ నుండినపుడు, తమిళ కన్నడు లాంధ్రయక్షగానముల ననుకరింప సాగిరి. మరియు తంజావూరు రాజ్యమున రాజులుగూడ యక్షగానములను పోత్సహింపఁగ, తెలుఁగు యక్షగానములు తంజాపురరాష్ట్రమందలి దేవాలయములలో 16, 17 శదాబ్దములనుండి భాగవతనాటకమేళములచే ప్రదర్శింపఁబడుచుండెను. తంజావూరు రాజ్యప్రభువులగు రఘునాథనాయకుఁడును, నతని కుమారుఁడు విజయరాఘవ నాయకుఁడు ననేక యక్షగానములను రచించిరి. వీరి తర్వాత పాలించిన మహారాష్ట్రరాజులుగూడ తెలుఁగు భాషను నేర్చుకొని కొన్ని యక్షగానములను వ్రాసిరి. దీనివలన యక్షగానమున కా కాలమున నెట్టి యాదరణ గలదో విశదమగును. ఇట్టి స్థితిలో నా దేశప్రజలగు తమిళు లూరక యుండలేరు కదా. అందుచే వారాంధ్ర



యక్షగానముల ననుకరించి తమిళమున యక్షగానములను వ్రాయ మొదలిడిరి. ఇట్లే ప్రాంతీయ కన్నడులనుగూడ నాకర్షించుటచే వారుగూడ యక్షగానములను దమభాషలో వ్రాయ మొదలిడిరి. వీరు పూర్వమే శ్రీకృష్ణరాయలకాలములో నాంధ్రులతో సంపర్క మేర్పరుచుకొనిరి కదా. ఈ కాలమున రంగాజమ్మ వ్రాసిన మన్నారుదాసవిలాసమను యక్షగానమున తమిళ కన్నడ మలయాళ భాషలను మాట్లాడు వివిధ పాత్రలు గూడఁ బ్రవేశపెట్టఁబడినవి. దీనివలన యక్షగానము లాంధ్రేతర దక్షిణదేశభాషలలోఁ గూడ 17-వ శతాబ్దమునుండి బయలుదేరుటకుఁ గారణ మాయెనని చెప్పవచ్చును కదా. విజయరాఘవు నాస్థానపండితుఁడగు గోవిందదీక్షితుఁడు తన 'సంగీతసుధ' లో యక్షగానమునుగూర్చి ప్రథమ పర్యాయముగా సంస్కృతమున నిర్దేశించినాఁడు.

తంజావూరు రాజ్యమున నా కాలమున వలసపోయిన యాంధ్రులలో కూచిపూడి వంశమునకుఁజెందిన మేలత్తూరు వేంకటరామశాస్త్రి యొకఁ డక్కడ స్థిరనివాస మేర్పఱచుకొని యా మండలమందలి దేవాలయములలో ప్రదర్శించుటకు 1750-75 ప్రాంతమున తెలుఁగులో ప్రహ్లాద, రుక్మాంగద, మార్కండేయ, యుషాపరిణయాది యక్షగానములను రచించెను. ఇవి గ్రంథలిపిలో ప్రస్తుతమున్నవి. వీనిని మేలత్తూరు, శూలమంగళము, ఊత్తుకాడు, దేవపెరుమాళ్లూరు మొదలగు గ్రామదేవాలయములలో ప్రదర్శించుదురు. ఇట్లితర భాషలలో యక్షగానము లాంధ్రమునుండి యనుకరింపఁబడిన వనుట స్పష్టము.

తెలుగునందలి మొట్టమొదటి యక్షగానము లిప్పుడు కానరావు. అవి కేవలము గేయములుగానుండి వేషముగట్టిన యొక స్త్రీచేఁ బాడఁబడెడివని వెనుక నూహింపఁబడినవి. యక్షగానము లీ స్థితిలో పాల్కురికి సోమనాథుని కాలమునకే కాక శ్రీనాథుని కాలమునఁగూడ నట్లే యుండెనని వెనుకఁ జూపిన నిదర్శనములనుబట్టియు, భీమఖండములో దక్షవాటీపురమును వర్ణించుచు శ్రీనాథుఁడు 'కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు-గాంధర్వమున యక్షగాన సరణి' యని

యక్షగాన పరిణామము

రచించుటచే స్పష్టమగుచున్నది. కాని మనకు ప్రస్తుతము దొరకు యక్షగానములలో నతి ప్రాచీనమైనది కందుకూరి రుద్రయ్య రచించిన సుగ్రీవవిజయము. ఇది క్రీ.శ. 1550 ప్రాంతమునందలిది. దీనికిఁ బూర్వము క్రీ. శ. 1506-9 ప్రాంతమున ప్రోలుగంటి చెన్నశౌరి సౌబరిచరిత్రమును యక్షగానముగా రచించి నరసింగరాయల కంకితముచేసెనని హరిభట్టు రచించిన యుత్తర నారసింహపురాణములో నిట్లు తెలుపఁబడినది.

సీ. ఆ మంత్రిపుంగవుం డష్టభాషాకవి, వర్యుఁడై పొగడొందె వసుధయందు
ద్విపదగా నారసింహపురాణ మొనరించి, భక్తి నహోబలభర్త కిచ్చె,
బాలభారత మంధ్రభాషను వచనకా, వ్యంబు చేసెను గవీశ్వరులు మెచ్చ,
సౌభరిచరితంబు జక్కుల కథఁజూపె, లాలిత నవరసాలంకృతముగ,

గీ. మఱియుఁ బెక్కుకృతుల్ పటుమతి రచించె,ఖ్యాతి నరసింగరాయలచేతఁగొనియె
నగ్రహారంబులును వివిధార్థములును, జెలసె గొండమ చెండ్లియై విభవమెసఁగ ॥

కాని యీ ‘సౌభరిచరిత’ మిప్పుడు కానరాదు. కాన దాని స్వరూప మెట్టిదో తెలియదు. ఈ నరసింహరాయల కాలముననే కూచిపూడి బ్రాహ్మణులు భాగవతమేళములను తయారుచేసెడివారని కర్నూలుజిల్లా, చెఱువుబెళగల్లు గ్రామమున క్రీ. శ. 1514 నాఁటి యొక శిలాశాసనమున ‘తాయికొండ నాటకప్రదర్శనము’ను గూర్చి చెప్పఁబడినది. (A. R. E 558 of 1915). కాన 16-వ శతాబ్దారంభముననే కూచిపూడివారు భాగవతప్రదర్శనములను ప్రారంభించిరని తెలియుచున్నది. అందుచే శ్రీనాథ శ్రీకృష్ణదేవరాయల మధ్యకాలములో యక్షగానము ‘పాట’ రూపమునుండి వివిధపాత్రలకుఁ ప్రవేశముగల ప్రదర్శనరూపముగ మారెనని యెంచవచ్చును. ఈ మధ్యకాలమున నా జక్కులవాండ్ర పాటలకు సంధివచనములు గలుపఁబడి పలువుర నటులచే ప్రదర్శనీయయోగ్యములుగాఁ జేయఁబడియుండును. ఈ కూర్పులు గొల్లభాగవతులే చేసి ‘శ్రీకృష్ణలీలలను’ దమ యభిమాన కథను ప్రప్రథమమున గూర్చియుందురని కొందఱి యూహ. మఱికొందఱు యానాదులే యీ సంధివచనములనుగూర్చి నరసింహస్వామి చెంచుకన్యను వివాహమాడిన ‘గరుడాచల నాటకము’ నాడిరని యూహించిరి. ఈ గరుడాచల నాటకకర్త నందవరపు ఓబయ



మంత్రి క్రీ. శ. 1600 ప్రాంతమువాఁడందురు. ఇది యెంతవరకు సత్యమో నిర్ణయింపరాదు.

కాని యాంధ్ర సారస్వతమున నూతనమార్గములు ద్రొక్కి మార్గదర్శకులైనది శివకవులు. వీరికున్న సాహస మితరులకు లేదు. ఆంధ్రమున ద్విపదకావ్యములు, శతకములు, నుదాహరణములు మొదలైన క్రొత్తక్రొత్త సారస్వత శాఖలను వీరు నెలకొల్పిరి. ఉదాహరణ కావ్యములలో కళికలు, నుత్కళికలును గేయములుగా పాడఁదగినవి. కాన మతప్రచారార్థమై శివకవు లీ జక్కులవాండ్రపాటలకు సంధివచనములను కలిపి శివభక్తుల కథలను సంతరింపఁజేసియుందురు. అందుకనే ఛాయామాత్రముగ పాల్కురికి సోమన,

“ప్రమథపురాతన పటుచరిత్రములు, క్రమమొంద బహునాటకము లాడువారు
లలితాంగ రసకళాలంకారరేఖ, లలవడ బహురూప మాడెడువారు.”

“కరమర్థి నూర సిరియాళుచరిత – పాటలుగాఁగట్టి పాడెడువారు,
అటుగాక సాంగ భూషాంగ క్రియాంగ, పటునాటకంబుల నటియించువారు.”

అని పండితారాధ్యచరిత్ర, బసవపురాణములలో వ్రాసినాఁడు. తర్వాత క్రమక్రమముగా వివిధములైన గేయములు, జంపెలు, తోహరలు, త్రిపుటలు మొదలైనవి చేర్పఁబడియుండును. ఇట్టి స్థితిలోనున్న యక్షగానములనే పామరులగు యేనాదులును గొల్లలును వీథినాటకములు లేక భాగవతము లనుపేర వీథులలో నాడెడివారు. వీనిలో సింగి - సింగఁడు పాత్రలు వత్తురు. ఇటుపిమ్మట బ్రాహ్మణులగు కూచిపూడి భాగవతులు వీనిని గ్రహించి, వృత్తములు మొదలైన పద్యములతోపాటు భరత నాట్యమును దీనికి జోడించి, తామే కొన్ని యక్షగానములనువ్రాసి ప్రదర్శింప మొదలిడిరి. ఈ ప్రదర్శనములు పండితపామరులను, నాబాలగోపాలము నానందపెట్టుటచే వీనికి దేశమున గౌరవాదరణములు పెరిగినవి. అందుచే పండితులుగూడ యక్షగానములను రచించుటకుఁ బూనుకొనిరి. కాని పామరులగు గొల్లయేనాదులు మాత్రము వెనుకరీతినే తమ వీథి నాటకములను సాగించుకొనుచుండిరి.

ఈవిధముగా దేశీయ సంప్రదాయములతో నాంధ్ర దేశమున యక్షగానములు రచింపఁబడి ప్రదర్శింపఁబడుచుండెను. వీనియందు ప్రారంభమున శ్రవ్యకావ్యములందువలె వివిధ దేవతాస్తుతులు, షష్ఠ్యంతములు వాడఁబడినవి. మధ్యలో రచనము కథనధోరణిలో నుండినది. వీనిలోని భాగము లాశ్వాసములనియే వాడఁబడినవి. కాని యీ ప్రక్రియ తంజావూరి రాజ్యములో రచింపఁబడిన యక్షగానములలో కొంచెము మారినది. తంజావూరిలో క్రీ.శ. 17, 18 శతాబ్దములలో ననేక యక్షగానములు రాజాదరణమున వర్థిల్లినవి. విజయరాఘవనాయకుఁ డనేక యక్షగానములను రచించినాఁడు. వీనిలో నతఁడు కొన్ని సంస్కృతనాటక సంప్రదాయములను ప్రారంభమున ప్రవేశపెట్టినాఁడు. దేవతాస్తుతులను తీసివేసి నాందిని, షష్ఠ్యంతములను పరిహరించి కైవారమును గూర్చి చివరకు భరతవాక్యమును గలిపెను. మఱియు త్రిపుటాది రగడులకు మారు దరువులును వాడబఁడెను. కథనధోరణిని పరిహరించి సూత్రధారునితో సంభాషణరూపమును ప్రవేశపెట్టఁబడినది. మఱియు నాటకమని బాహాటముగావాడి యక్షగానమను పేరతఁడు జారవిడిచెను. తంజావూరురాజ్యము విజయరాఘవుని తర్వాత మహారాష్ట్రులపాలైనను, వారుగూడ నాంధ్రమున యక్షగానములను రచించిరి. వీరి కాలములో 'కొరవంజి' యను యక్షగాన భేద మేర్పడినది. ఇది తమిళులనుండి మనలోఁ జేరినది. 'ఎఱుకిత వచ్చి తానెఱుకఁ జెప్పుటయు, గురుతుగా శాహేంద్రు గూడియుండుటయు,నని యెడి రాజమోహన కొఱవంజి'. ఇందు ఎఱుకత ప్రవేశముగల్గి శృంగారరసము ప్రధానముగా నుండును. ఈ కాలపు యక్షగానములలో కైవారమునకు బదులు సూత్రధారుఁడు ప్రస్తావనయుఁ గలిగి అంకవిభాగముగూడ చేయఁబడినది. ఇట్లు క్రమముగా సంస్కృతనాటక పారిభాషికము లిందు చేరినది.

యక్షగానములు ప్రారంభమున భగవన్మాహాత్మ్యప్రధానకథలతో వెలువడినవి. అందుచేతనే యవి భాగవతములనికూడఁ బిలువఁబడుటకు కారణ మయ్యెను. ఇందు శివసంబంధమైనవి, విష్ణుసంబంధమైనవికూడఁ గలవు. ఉదా. కృష్ణలీలలు, శివవిలాసము మొదలైనవి. తర్వాత భగవద్భక్తులు పౌరాణిక రాజులు, మొదలైనవారి కథలు గైకొనఁబడినవి. ఉదా.



ప్రహ్లాద, రుక్మాంగద, హరిశ్చంద్ర మొ. శివకవులుమాత్రము చారిత్రక శివభక్తుల చరితలను గ్రహించిరి. ఉదా. అనుమోద సన్యాసి రచించిన 'బసవకల్యాణము; బాల పాపాంబ వ్రాసిన అక్కమహాదేవిచరిత్ర మొ॥ ఇవికాక వేదాంత ప్రతిపాదకములైన యక్షగానములుగూడ వెలసినవి. ఉదా. పరమానందతీర్థయతికృత, 'ముక్తికాంతాపరిణయము'; చల్లా సూరయ్యవ్రాసిన 'వివేకజయం' మొ॥ కాని సమకాల సాంఘికవిషయములనుగూర్చిన కథ లాంధ్ర దేశీయ యక్షగానములలోఁ గానరావు. ఈ పద్ధతి తంజావూరి యక్షగానములలో రూపొందినది. ఉదా. విజయరాఘవనాయక రచిత 'రఘునాథాభ్యుదయము', పురుషోత్తమ దీక్షితుని 'తంజావూరన్నదానమహానాటకము', రంగాజమ్మకృత 'మన్నారుదాస విలాసము' మొ. కథావిషయమున యక్షగానమునఁగల పరిణామ మిట్టిది.

ఇట్టి యక్షగానములు క్రీ.శ. 13-వ శతాబ్దపువాఁడైన పాల్కురికి సోమనాథుని కాలమునాఁటికే యాంధ్రదేశమున నాడఁబడుచుండెడివని వెనుకఁ జూపిన ప్రమాణములనుబట్టి తెలియుచుండఁగా, 16-వ శతాబ్దికిఁ బూర్వమునఁ గల యక్షగాన మొక్కటైన నింతవరకు మనకు దొరకదు. క్రీ. శ. 16-వ శతాబ్దమునుండి కానవగు యక్షగానములు పండితులచేఁ గూడ వ్రాయఁబడినవి. 17-వ శతాబ్దమునుండి వీనిని రాజులు గూడ నాదరించి రచించుటచేఁ గాఁబోలు శీఘ్రముగనవి యభివృద్ధికి వచ్చి బ్రాహ్మణులు గూడ వీనిని రచించి ప్రదర్శింపసాగిరి. కాని 13-16-వ శతాబ్దుల మధ్యనున్న యక్షగానములు కేవలము పామరులచే వ్రాయఁబడి యాడఁబడుటచేఁ గాఁబోలు సంస్కారశూన్యమగుటచే, తర్వాత వచ్చిన శిష్టమైన యక్షగానముల ముందర నిల్వలేక కాలగర్భమున నణఁగిపోయి యుండును. ఆంధ్రయక్షగానములు స్థలమునుబట్టి శుద్ధాంధ్రదేశ యక్షగానములనియు, దక్షిణాంధ్ర యక్షగానములనియు, కథావస్తువును బట్టి శైవము, వైష్ణవము, వేదాంతము, సాంఘికములనియు, కాలమును బట్టి శైవమత విజృంభణ పూర్వకాలపువనియు, శైవమతకాలమునాఁటివి, శైవమతానంతరకాలపువి, యాధునికములనియు విభజింపవచ్చును. వీని రచనలలోఁ గూడఁ గొంత భేదము గలదు. ఇందు వచ్చు పాత్రలను బట్టి,

వాతావరణమునుబట్టియు నివికొఱవంజి యనియు, వీథినాటకమనియు, యక్షగానమనియు, కలాపమనియు, కథయనియుకూడ విభజింప వచ్చును. మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారముననూ, తంజావూరు శరభోజీ సరస్వతీమహలుననూ, కాకినాడ ఆంధ్రసాహిత్యపరిషత్తు పుస్తకాలయమున ననేక యక్షగాన లిఖితగ్రంథములు గలవు. కొన్ని మాత్రము గుజలీప్రతిలో తప్పుల తడకలుగా ముద్రితములైనవి. కొన్ని మాత్రము పరిశుద్ధముగా ముద్రింపఁబడినవి. ప్రస్తుతము దొరకున వివి. వీనిలో ననేకింటికి కాలనిర్ణయము చేయుట చాల కష్టము.

## I ఆంధ్రదేశ యక్షగానములు :-

### (i) శివకథలు

1. రెగళ్లిగ నిమ్మనాథుఁడు —1. గురుసంబిచరిత్ర.
   2. నిజలింగ చిక్కయ్య కథ.
2. అనుమోద సన్యాసి — బసవకల్యాణము.
3. కానూరు వరవీరభద్రుఁడు — బసవమహిమామృతవిలాసము.
4. బాల పాపాంబ — అక్కమహాదేవిచరిత్ర.
5. వాలె కోటయ్య — చిరుతొండభక్త కథానిధానము.
6. బుక్కమ (జక్కన) సాంబయ్య — భల్లాణచరిత్ర.
7. అలపాకపెద్ది — భల్లాణనాటకము.
8. గుజ్జము చినపోతయ్య — వీరచోడవ్వచరిత్ర
9. వీరభద్రకవి — సీమంతినీవిజయము.
10. శివలెంక మల్లనారాధ్యుఁడు — వీరభద్ర విజయము.
11. పెదకెంపరాయఁడు — గంగాగౌరీ విలాసము.
12. పాలంకి పిన కబోది — దారుకావనక్రీడ.
13. మంగలపల్లి సూర్యనారాయణ — గౌరీకల్యాణము.
14. నాగభూషణకవి — ,,
15 పెద్దామాత్యుఁడు — ,,
16. కూరపాటి అమరలింగామాత్యుఁడు — పార్వతీకల్యాణము.
17. వెంకటకవి ,,
18. వెలువలి పెద్దయామాత్యుఁడు — భద్రకాళీకల్యాణము.



19. సిద్ధగురులింగము — శ్రీగిరి కురవంజి.
20. గోగులపాటి కూర్మనాథకవి — మృత్యుంజయవిలాసము.
21. తరిగొండ వెంకమాంబ — 1. శివవిలాసము.
   2. శివపారిజాతము.

### (ii) విష్ణుకథలు

1. కందుకూరి రుద్రయ్య — సుగ్రీవవిజయం.
2. నందవరపు ఓబయమంత్రి — గరుడాచలము.
3. నందవరము సింగన — పారిజాతకథ
4. పురిజాల లక్ష్మీనారాయణ — పారిజాతచరిత్ర
5. చల్లా నారాయణ — పారిజాతనాటకము
6. నారాయణకవి — నరకూరి పారిజాతము.
7. శృంగారకవి శ్రీనివాసయ్యంగారు — 1. రంగపురి పారిజాతము.
   2. గోపాలవిలాసము,
8. పాకనాఁటి గణపతిరెడ్డి — గోపాలవిలాసము.
9. తిమ్మయ్య దండనాథుఁడు — కృష్ణవిలాసము.
10. వెన్నముద్ద గణపతిపెద్దకవి — ,,
11. ముద్దరాజు పెద్దరామన్న — ,,
12. సూర్యకవి — వేంకటేశ్వరవిలాసము.
13. కంకంటి పాపరాజు — విష్ణుమాయావిలాసము.
14. రాజా లక్ష్మాజీ — రుక్మిణీకల్యాణము.
15. ప్రోలుగంటి వేంకటకృష్ణయ్య — శారదాకురవంజి.
16. నక్కలపాటి సంజీవకవి — గొల్లభామ కథ.
17. అకలంక కృష్ణకవి — జలక్రీడావిలాసము.
18. శోభనాద్రి — జలక్రీడావిహారము.
19. (భారతి) రామరాజు — 1. పొట్లదుర్తి జలక్రీడలు.
   2. గొల్లవేషముకథ.
20. ఆత్రేయపు తిమ్మన — 1. గొల్లవేషముకథ. 2. సముద్రమథనము
21. వెంకటపతి— 1. కాళింగమర్దనము. 2. రాధామాధవసంవాదము

22. వేంకటాచలదాసు — భాగవతము.
23. మూళగిరికవి — ఉషాపరిణయము.
24. విరిపాటి నృసింహరాజు — ఉషాపరిణయము.
25. శ్రీనివాసుఁడు — ఉషాపరిణయము.
26. వేములపల్లి వేంకటసుబ్బకవి — ఉషాపరిణయము.
27. అనంతకవి — ఉషాపరిణయము.
28. ఆనందదాసు — 1. ఉషాపరిణయము. 2. రామనాటకము, 3. కుశలవనాటకము.
29. రాజలింగకవి — రుక్మాంగదచరిత్ర.
30. పాపారాయసుధి — రుక్మాంగదచరిత్ర.
31. రామానుజసూరి — ప్రహ్లాదనాటకము.
32. తిరునారాయణాచారి — „
33. బొడ్డచెర్ల సుబ్బకవి — „
34. లక్ష్మణదాసుకవి — „
35. శేషగిరిదాసు — రామాయణము.
36. రాఘవదాసు — „ (గుత్తెనదీవి)
37. శేషాచలదాసు (కృ) — 1. ధర్మపురి రామాయణము. 2. సముద్రమథనము.
38. వేంకటరాయమహాకవి — 1. లేపాక్షి రామాయణము. 2. లేపాక్షి కృష్ణనాటకము. 3. రంగనాథవిలాసము.
39. శఠగోపాచార్యుడు — రామనాటకము.
40. రాపాక శ్రీరామకవి — ఆధ్యాత్మ రామాయణము.
41. పట్టాభిరామయ్య — సుందరకాండము.
42. అగస్త్యరాజు రామన — సీతాకల్యాణము.
43. పాలవెంకరి మల్లభూపాలుఁడు — సీతాకల్యాణము.
